# మధుర భావన-7

భోజనాలు చేస్తున్నపుడు వంశీ ''ఈ పేళ... వంటకాలన్నీ కొంచెం ప్రత్యేకంగా ఉన్నాయి... ఎవరిదో కొత్త చేయి పడినట్లుందీ...!'' అంటూ సుమజ పైపు చూశాడు.

సుమజ నవ్వు మొహంతో తల అడ్డంగా వూపి ''నేనేం అస్సలు కల్పించుకోలేదు! అయినా వంట సరిగారాని మీలాంటి వాళ్ళెవరైనా నా సహాయం తీసుకుంటారు గానీ... ఇద్దరూ మహామహులైనపుడు... నా చేయి పడే అవకాశం ఇవ్వనే ఇవ్వరుగా! నేను ఖాళీగా కూర్చుని... టి.వి.తో, సెల్ ఫోన్ తో కాలక్షేపం చేసేశాను...!'' అంది.

వంశీ కూడా నవ్వు మొహంతో చూస్తూ ''ఇద్దరు ఉద్దండులు కలిసి చేసినందువలనే అయివుంటుంది వంటకాలన్నీ ఇలా ప్రత్యేకంగా చాలా రుచిగా ఉన్నాయి...!'' అన్నాడు.

''ఎపుడూ మీ ఇంట్లో చేసేవాటికి కొంచెం మార్పుగా చేస్తే నచ్చదేమోనని సంశయించా, ఫరవాలేదన్నమాట... ! '' అంది భార్గవి.

శ్యామసుందరి చిన్నగా నవ్వింది.

''మా అబ్బాయికి... మీ ఇంటికి రాకముందే... మీ వంటలరుచి చూపించేశారు...!'' అంది.

వంశీ కొంచెం అలకగా తల్లివైపు చూసి ''అపుడే... ఏమిటమ్మా నువ్వలా అంటున్నావూ...?'' మెల్లగా గొణుగుతున్నట్లుగా అని చేయి కడుక్కోవటానికి డైనింగ్ టేబుల్ దగ్గర్నుండి లేచాడు.

***

కాసేపటికి... బయలుదేరి వెళ్తున్నామని చెప్పటానికన్నట్లు వంశీ తీరుబడిగా కూర్చున్న గదిలోకి వచ్చింది సుమజ.

చిరునవ్వుతో వంశీ సుమజవైపు చూసి ''ఏమిటి పండూ...?'' అన్నాడు.

సుమజ పకపక నవ్వింది.

వంశీ ఆశ్చర్యంగా చూసి ''ఎందుకంతగా నవ్వుతున్నావూ...?'' అనడిగాడు.

సుమజ కొంచెం ఓరగా చూసి ''ఏదో గుర్తుకొచ్చిలే...'' అనేసింది. ''అదేమిటో చెప్పకూడదా?'' అంటూ వంశీ రెట్టించే సరికి సుమజ అలాగే నవ్వుమొహంతో ''సరే... చెబుతా. నాకేం అభ్యంతరం లేదులెండి. ఎప్పటిదో ఒక సంఘటన గుర్తుకొచ్చిందని అన్నాగా... అదేమిటంటే... ఒక సినిమాలో హీరో, హీరోయిన్ ని ఆమె ముద్దుపేరుతో పిలిచి అల్లరిచేయాలనుకుని సరదాగా అలా పిలుస్తాడు. అంటే... ఆ అమ్మాయికి 'పండు' అనే తన ముద్దుపేరు ఎవరికీ తెలియటం ఇష్టం ఉండదన్నమాట! అందుకని కొత్త వాళ్ళు అలాపిలిస్తే బాగా ఉడుక్కుంటుంది... అందుకే... మీరు నన్నలా అల్లరిగా పిలిచారనుకుంటున్నా. అయితే మీకో సంగతీ చెబుతా. నేను కాలేజీలో చదువుతున్నప్పటిదీ విషయం. నేనొకరోజు కాలేజీకి వెళ్తుంటే... ఓ నలుగురు అబ్బాయిలున్న బృందంలోని ఒకడు... నాకు ఫ్రెండ్సులో 'పండు' అనే ముద్దుపేరు ఉందని తెలుసుకున్నాడేమో...' పండు... పండు... పండూ.. ఎర్ర గుండు... యాపిల్ దానిపేరు...' అని ఓ సినిమా పాటని రాగం తీశాడు.

నేనేం భయపడకుండా వాళ్ళ దగ్గరకు వెళ్ళి ధైర్యంగా అడిగాను... 'మీలో ఎవరండీ... నన్నా పేరుతో పిలిచిందీ?' అని. ఎవరూ మాట్లాడలేదు. కళ్ళప్పగించి చూస్తుండిపోయారు.

'ఎవరో చెబితే నేను ఆనందంగా అతనిని 'అన్నయ్యా' అని పిలుద్దామనుకున్నా. ఎందుకంటే మా ఇంట్లో మా అన్నయ్య అలా పిలుస్తూంటే... నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఇపుడు ఫారిన్ లో ఉన్నాడు. అందుకే... మా అన్నయ్యని గుర్తుచేస్తూ... నాకు ఆనందం కలుగజేసిన వాళ్ళని అభినందిద్దామని అనుకున్నా. కానీ ఎవరూ చెప్పటం లేదు మరి.... సరే...' అంటూ వచ్చేసాను.

ఇక ఆ తర్వాత అబ్బాయిలు ఎవరూ కూడా 'పండు' అని పిలవనే లేదు...! ఇపుడు మీ పిలుపుతో ఆ సంఘటన గుర్తొచ్చి నవ్వొచ్చింది...!''

''అమ్మో... ఇంతకథ ఉందా.... ఇక నేను కూడా ఎపుడూ అలా పిలవను...!'' అన్నాడు సరదాగా నవ్వేస్తూ. సుమజ వైపు సందేహంగా చూస్తూ ''అవునూ.. మీకు... అన్నయ్య ఉన్నట్లుగా తెలియదే...'' అనడిగాడు.

సుమజ మళ్ళీ ఫక్కున నవ్వింది. ''నాకు అన్నయ్యలెవరూ లేరు. అలా వాళ్ళతో తమాసా కోసం అన్నానంతే! మళ్ళీ వాళ్ళెపుడూ అలా పిలిచి ఏడిపించాలనుకోలేదు! చూశారా... నా ఉపాయం ఎలా

పనిచేసిందో...! నాలాగే మీరూ ఒక్కరే కాబోలనుకున్నాం! కానీ... ఇపుడే తెలిసింది మీకో చెల్లి ఉందని...! ఎంతైనా తోడబుట్టిన వాళ్లుంటే... ఆ ఆనందమే వేరుగా ఉంటుంది...!''

సుమజ మాటను అంగీకరిస్తున్నట్లుగా తలవూపాడు వంశీ.

''సరేమరి... మేం వెళ్ళిరామా...'' అంది యథాలాపంగా సుమ.

వంశీ చిరునవ్వుతో వద్దన్నట్లు తలవూపి ఇక్కడే ఉండిపొమ్మన్నట్లు చేతి వేలితో చూపించి సైగ చేసాడు.

సుమజ సరదాగా నవ్వేసి ''మరి మధుర భావనలకు సమయం కావాలని అన్నది మీరేగా...'' అని ఒక క్షణం ఆగి మళ్లీ ''దేనికైనా మితమే ముద్దు... అతి అనర్థమే... అంటారు... ఆలోచించండి...!'' అంటూ అక్కడనుండి చకాచకా వెళ్ళిపోయింది నవ్వుమొహంతో.

ఆ మాటలకు అర్థం ఏమై ఉంటుందనే ఆలోచనలో పడిపోయాడు వంశీ. కాసేపటికి అతని పెదవులపైకి చిరునవ్వు వచ్చింది.!

***

''అమ్మా... అమ్మా...'' గుమ్మం దగ్గిరే నిలబడిన అనూష గట్టిగా పిలిచింది. లోపల ఉన్న శ్యామసుందరి కూతురి పిలుపు విని గబగబా అక్కడకు వచ్చి ''ఎప్పుడు వచ్చావు అనూ.. అదేమిటీ లోపలకు రాకుండా అక్కడ నుంచే కేకలు పెడుతున్నావూ...?'' అంది.

''ఏమో మరి... అనుమతికోసం పిలిచా... ఇంట్లోకి ఎకాఎకీన రావటానికి ఇంట్లో వాళ్ళం కాదుగా...!'' అంది అనూష నిష్టూరంగా చూస్తూ.

''అదేమిటే అలా అంటున్నావ్?'' ఆవిడ ఆశ్చర్యపోయింది.

''నేనీ ఇంటికి చెందినదానిని కాదని నాకూ ఈ మధ్యనే తెలిసింది...!'' కూతురి మాటలకు ఆవిడ నవ్వుమొహంతో ''చాల్లే... చమత్కారం... లోపలకురా ముందు...'' అంటూ చేయి పట్టుకుని లోపలకు తీసుకువచ్చింది.

అక్కడున్న సోఫాలో కూర్చుంటూ అనూష అంది ''నేనీ ఇంటి మనిషిని అయితే, నేను లేకుండానే ముఖ్యమైన నిర్ణయాలు జరుగుతాయా...?''

శ్యామసుందరి ఆశ్చర్యంగా చూసి ''నువ్వు లేకుండా... ఏం జరిగాయాయి?'' అంది.

''జరగలేదా... అన్నయ్యకి పెళ్ళి నిశ్చయం అయిందని... నువ్వు మా అత్తగారికి ఫోను చేసి చెప్పావుగా...?''

''అవునూ ... చెప్పాను. మీ ఇంట్లో పెద్దవాళ్ళకి చెప్పటం బావుంటుందని ముందుగా ఆవిడతో అన్నాను.. అయితే....?''

''అయితే అంటావేమిటమ్మా... నిశ్చయానికి ముందు... అన్నీ మాట్లాడుకునేటపుడు నేనూ ఉండాలిగా... మరి... నన్ను పిలవలేదెందుకూ...?''

శ్యామసుందరి చిన్నగా నవ్వింది. ''బావుందే... పెళ్ళి మాటలంటూ ఏమున్నాయి? మీ అన్నయ్యకి నచ్చిన అమ్మాయిని నాకు చూపించాడు... అంతేకదా...''

''అవును... చూసావు సరే... పెళ్ళి నిర్ణయమైపోయిందని ఎలా అనుకున్నావు? వాళ్ళు ఏమిస్తారో ఏమిటో అవన్నీ మాట్లాడేశావా?''

''వాళ్ళిద్దరికీ ఇష్టం అయింది. వాళ్ళ వాళ్ళు అవన్నీ ఆలోచించుకునే ఉంటారు. లేకపోతే, నాలాగే... పిల్లలిద్దరికీ ఇష్టం కదాని సరే అనుకుని ఉంటారు... నేనెక్కడికీ వెళ్ళటం లేదని వంశీ వాళ్ళతో అనటం వలన కాబోలు... అమ్మాయిని తీసుకుని వాళ్ళమ్మగారు తన స్నేహితురాలింటికి వచ్చి, మనింటికీ వచ్చారు... జరిగిందిదే...!''

''ఏమిటమ్మా... అమాయకురాలిలా మాట్లాడుతున్నావ్... నా పెళ్ళి ఎలా జరిగిందీ...! అటు ఇటు సంబందించిన పెద్దవాళ్ళంతా కూర్చుని ఇచ్చి పుచ్చుకోవటాలు లాంటి విషయాలన్నీ మాట్లాడుకోవటం అయ్యాకనే కదూ సరే ననుకున్నారూ...?''

''అవును... అపుడు మీ నాన్న ఉన్నారు. మేం వెతికి చూసిన సంబంధం కాబట్టి అలా అవన్నీ జరిగాయి. ఇపుడు వంశీయే ఇంటికి పెద్ద. ఆపైన వాడికి నచ్చిన అమ్మాయి తారస పడింది కాబట్టి సంబంధం చూడాల్సిన అవసరం లేకపోయింది. ఈ మధ్యనే దామోదరం గారింటి శుభకార్యంలో కలుసుకున్నారు...

ఇద్దరికీ ఇష్టమేనని సంగతి వాళ్ళు అనుకున్నాక పెద్దవాళ్ళకి చెప్పటం జరిగింది. ఎవరికీ అభ్యంతరం లేకపోయింది. అంతేగా. ఇందులో మాట్లాడుకోవటాలూ... నిన్ను పిలవటం... లాంటివి ఏం ఉంటాయి...? పెళ్ళి ఎక్కడ, ఎపుడు, ఎలా అనేవన్నీ అనుకున్నాక ముందుగా నీకే తెలుస్తుంది. అమ్మాయిని చూసాను కాబట్టి... పెళ్ళి అనేది నిశ్చయమేనని నీకూ తెలుస్తుందని ముందుగా మీ అత్తగారికి చెప్పానంతే...!''

సంజాయిషీ ఇచ్చినట్లు శ్యామసుందరి వివరంగా చెప్పింది కూతురికి.

''అది సరేగానీ... ఈ విషయం నువ్వు చెప్పినట్లుగా చెప్పి మా అత్తగారు నాతో ఏమన్నారో తెలుసా? పెళ్ళిలో అమ్మాయి తరుపువాళ్ళు నీకిచ్చే లాంఛనాల గురించీ మాట్లాడుకున్నారా... అనడిగితే, నేను తెల్లమొహం వేసాను. నాకసలు పెళ్ళి విషయమే చెప్పలేదు నువ్వు. మా అత్తగారడిగిన ఆ వివరాలన్నీ తెలుసుకుందామని వచ్చానిపుడు''

కూతురి మాటలకు ఆవిడ విస్తుపోయినట్లుగా చూస్తూ ''నీకు... లాంఛనాలు ఏమిటీ?'' అనడిగింది.

అనూష నవ్వింది.

''ఏమిటమ్మా... పెద్దదానివి... చిన్నపిల్లని నన్ను అడుగుతున్నావ్....! బావుంది, పెళ్ళిలో ఆడబడుచు లాంఛనాలని ఉంటాయిగా... ఆ విషయమే మా అత్తగారు అడిగి తెలుసుకోమని చెప్పారు!''

అనూష మాటలకు శ్యామ సుందరి మొహం చిన్నబోయింది.

''నేనలాంటివన్నీ అడగనమ్మా. అడగలేను కూడా. అది నా పద్ధతి కాదు! అమ్మాయి... మనవాడికి సరిజోడీలా ఉందికదా అనుకున్నాను. మంచి స్వభావం కలిగిన అమ్మాయే ననిపించింది మనింట్లో ఉన్న కాసేపటిలో. అందుకే నేనేం అభ్యంతరం చెప్పదలుచుకోలేదు. పెళ్ళికి ఇదే ముఖ్యం కానీ మిగతా విషయాలేవీ కాదు. అంటే... అలాంటివన్నీ చూసుకోకూడదని కాదుగానీ... వాళ్ళిద్దరి మధ్య ఏర్పడిన ప్రేమకే ఎక్కువ విలువ ఇవ్వాలనేది నా అభిప్రాయం! అర్థమైందిగా...!''

తల్లి మాటలకు వ్యంగ్యంగా నవ్వింది అనూష. ''సరేలే... ఈ మాటలకేంగానీ, అన్నయ్య రానీ... నేనే అడుగుతా. ఇంట్లో లేనట్టున్నాడు... ఎక్కడికి వెళ్ళాడేం?''

''ఏదో బిజినెస్ ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నాడుగా, ఆ పనులు మీద తిరుగుతున్నాడనుకుంటా...!'' నిర్లిప్తంగా జవాబు చెప్పిందావిడ.

* * *

కాసేపటికే ఇంటికి వచ్చిన వంశీ అనూషని చూసి ఆదరంగా పలుకరించాడు. ఎప్పుడు వచ్చావంటూ.

ఆ ప్రశ్నకి అనూష అన్నగారి వైపు నిష్టూరంగా చూసి ''నాకు చెప్పకుండానే పెళ్ళి ఏర్పాట్లు చేసేసుకుంటున్నావా?'' అంది. వంశీ చిరునవ్వుతో చూసి ''ఇంకా పూర్తిగా అనుకోలేదుకదా... అయినా అమ్మ చెప్పేవుంటుందిగా... లేకపోతే నీకెలా తెలుస్తుందీ...?'' అన్నాడు.

''అవును.. అమ్మ చెప్పింది... నాతో కాదులే... మా అత్తగారితో, పెళ్ళిలో నాకు ఇవ్వాల్సిన కానుకలు గురించి మాట్లాడాల్సి వస్తుందని... నాకు చెప్పలేదనుకుంటా...?''

''అమ్మ... కానుకలగురించి... భయపడుతుందా...! భలే చిత్రంగా మాట్లాడుతున్నావే...!'' వంశీ మళ్ళీ నవ్వాడు.

''అయితే... నేను అడిగినా...ఇస్తావా...? వాళ్ళని అడగనని అమ్మ చెప్పిందిలే...!'' అంటూ అనూష నిట్టూర్చింది.

''తప్పకుండా, నిజమే, వాళ్ళని అడగటం ఏమిటీ...! నీకు ఏం కావాలన్నా మేం ఇస్తాం...!'' దృఢ నిశ్చయమన్నట్లుగా వంశీ చెప్పిన మాటలకు అనూష ''నిజంగా...?'' అంటూ రెట్టించింది.

''సందేహమెందుకూ... నిజమే. కాకపోతే నా శక్తికి మించనిదేదీ అడగకూడదు మరి....!''

అనూష ఆనందంగా నవ్వింది. ''నీ శక్తికి మించినదీ, నీ దగ్గరున్నదే అడుగుతానులే...!'' అంటూ భరోసా ఇచ్చి తల్లివైపు చూసి ''అమ్మా... అన్నయ్య ఇస్తానని ఒప్పుకున్నాడు... నువ్వు అభ్యంతరం చెప్పకూడదు మరి...!'' అంది.

ఆవిడ అనూషవైపు విచిత్రంగా చూసింది.

''మీ అన్నయ్య ఇస్తానని అన్నదానికి నేనెందుకు అభ్యంతరం చెబుతానూ...?'' ఆ మాటలకు అనూష మళ్ళీ నిట్టూర్చింది.

‘‘ఏమో... కొన్ని విషయాల్లో... ఏదో సామెతలా దేముడు వరమిచ్చినా, పూజారి ఇవ్వకపోవచ్చని అంటూంటారుగా... అది గుర్తుకొచ్చి అన్నాలే...!’’

‘‘సరే... సరేలే... నేనేం అడ్డుపడను... అభ్యంతరమూ చెప్పను...!’’ ఆవిడ మాటలకు అనూష ఆశ్చర్యంగా చూస్తూ ‘‘నిజంగానే కదా, బాగా గుర్తుపెట్టుకో...’’ అంది.

ఆవిడ కూతురి వైపు కొంచెం అయోమయంగా చూస్తూ ‘‘అదేమిటో ముందు చెప్పవచ్చుగా...?’’ అంది.

‘‘చెబుతా... ఇపుడు కాదు... మళ్ళీ వచ్చినపుడు!’’ అంది అనూష స్థిమితపడినట్లుగా మొహం పెట్టి.

‘‘సరేలే... మేం ఇవ్వలేనిది అడగనన్నావుకదా... ఆ మాట చాలు. దగ్గరున్నది ఏదైనా ఇవ్వటానికేం...!’’ అంటూ ఆవిడ అక్కడితో సంభాషణకు ముగింపు పలికింది.

ఆ తరువాత శ్యామసుందరి కూతురుని ‘‘సుమజని చూస్తావా... రమ్మని పిలుద్దామా... వచ్చేవరకూ ఉంటావుగా...’’ అని ఆరాతీసింది.

అయితే దానికి అనూష ఆ విషయం మీద అంత ఆసక్తి చూపించకపోవటం ఆవిడకు కొంచెం విచిత్రంగా అనిపించింది. “నేను మళ్లీ వస్తానని చెప్పా కదా, అపుడు నాలుగురోజులు ఉంటానని ఇంట్లోవాళ్ళకి చెప్పి వస్తాగా, అపుడు ఆలోచిద్దాంలే అమ్మా....!’’ అని అనూష తేల్చేసింది.

* * *

ఆ రోజు సుమజ వంశీకి ఫోనుచేసింది.

మొదటగా ‘‘మీ అనూష వచ్చి వెళ్ళిందటగా?’’ అంది.

‘‘అవునూ... మీకెలా తెలిసింది?’’ వంశీ కొంచెం ఆశ్చర్యం ప్రకటించాడు.

‘‘ఇపుడు... మీ ఇంటి విశేషాలు తెలుసుకోవటానికి మీరొక్కరే మార్గం కాదు...!’’

‘‘మరి...?’’

''మీ... మా... అమ్మలిద్దరూ మంచి స్నేహితులయ్యారు! ఆ వూరు నుండి అక్కడనుంచి ఇంటికి రాగానే, ఆ విషయం అమ్మ ఫోను చేసి మీ అమ్మగారికి చెప్పింది... తరువాత ఇపుడు... అత్తయ్య... అపుడే ఈ వరస ఎందుకులెండి... మీ అమ్మగారు ఫోన్ చేసి మాట్లాడుతూ ఈ విషయమూ చెప్పారు! సరే, అనూష కబుర్లేమిటీ...?'' అంది సుమజ యథాలాపంగా.

వంశీ చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు ''పెళ్ళికి... కానుక కావాలట తనకు!''

''అవును... ఆడబడుచు లాంఛనం అని ఉంటుందట. అది మేమే ఇవ్వాలట! అమ్మ నాన్నగారితో చెప్పటం విన్నాను....!''

''అలా ఇవ్వటాలు ఏమీ ఉండవని మా అమ్మ చెప్పింది. అయినా మా చెల్లెలుకు ఏం కావాలో అది నేనివ్వటమే సబబుగా ఉంటుంది! మా అమ్మ ఇంకోమాటా చెప్పింది... ఇద్దరూ ఆస్తిపాస్తుల వివరాలూ చెప్పుకోవటం జరిగిందట! మీ అమ్మగారు చెప్పారని అమ్మ చెప్పింది. మీ నాన్నగానే తన ఆస్తి అనీ, ఆయన ఇపుడు ఏం సంపాదించినా అది వాళ్ళిద్దరికీ చాలనీ, ఇక ఉన్నదంతా నీకే చెందుతుందని, పెళ్ళిలో గానీ తర్వాత గానీ ఏం అడిగినా ఇవ్వటానికి సిద్ధమని చెప్పారట! మా అమ్మ అలా ఏం అడిగీ, తీసుకునే పద్ధతి లేనేలేదని, పిల్లల ఇష్టాన్ని గుర్తించి పెద్దవాళ్ళుగా పెళ్ళిచేయటమే నని చెప్పిందట !'' అంటూ వంశీ నవ్వాడు.

''అవును... ఆ కబుర్లన్నీ నాన్నగారిని చెప్పేటప్పుడు నేనూ విన్నాను. మా అమ్మకి మీ ఇంటికి వెళ్ళొచ్చాక... అబ్బ... అమ్మ ఎంత సంతోషపడిపోతోందో...! మీ అమ్మ గారు ఇంటిని పొందిగ్గా, అందంగా తీర్చి దిద్దుకున్న తీరూ... హుందాగా ఉన్న ఆమె రూపం... మాటతీరూ.. ఇలా అన్నీ బాగా నచ్చేశాయన్నమాట... అందుకే నాన్నగారికి వర్ణించి.. వర్ణించి మరిమరీ చెప్పింది! నన్ను చాలా అదృష్టవంతురాలిననీ పొగిడింది!'' అంటూ సుమజా నవ్వింది.

''అయితే... మా అమ్మ గురించేగానీ, నాగురించి ఏం చెప్పలేదన్నమాట! అంతేగా...?'' అన్నాడు వంశీ మాటల్లోనే కొంచెం అలకను నటిస్తూ.